# ఆదివాసీ విచారణ ఖైదీలు

**19వ** శతాబ్దపు మొదటి భాగంలో, శిక్ష విధించబడిన ఖైదీలను నిర్బంధించే స్థావరంగా మాత్రమే కారాగారాలు వుండేవి. దురదృష్టవశాత్తు, ఈనాటివరకు, దాదాపు భారతదేశ కారాగారాలన్నీ విచారణలోనున్న ఖైదీలతో నిండిపోయి వున్నాయి. భారతదేశంలోని జైళ్ళన్నింటిలో 65 శాతం విచారణలోనున్న ఖైదీలే వున్నారని జైళ్ళ సమాచారం తెలుపుతోంది. కాలం గడుస్తున్న కొలదీ జైళ్ళలో విచారణ ఖైదీల సంఖ్య పెరుగుతూ వస్తోంది. 2017 నవంబర్ 4 నాటి 'ఎనకామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ'లో ఇర్ఫాన్ అహమ్మద్, మహమ్మద్ జకీరియా సిద్ధిలు రాసిన ఓ వ్యాసంలో జైళ్ళలో అత్యధిక సంఖ్యలోనున్న అల్పసంఖ్యాక విభాగాల వారి గురించి ప్రముఖంగా పేర్కొన్నారు. మరింత నిర్దిష్టంగా ఆదివాసులు, దళితులు, క్రిస్టియన్లు, ముస్లిములు మొదలైన వారంతా దేశ జనాభాలో వారి సంఖ్యతో పోల్చినపుడు అధిక సంఖ్యలో జైళ్ళలో మగ్గుతున్నారని వెల్లడించారు. మొత్తం జనాభాలో ఆదివాసులు 8.63 శాతం వుండగా, మొత్తంగా జైళ్ళలో వున్న వారి సంఖ్యలో ఆదివాసులు 11.33 శాతం వున్నారు. దళితులు మరియు ఆదివాసులుగా వున్న ఖైదీల సంఖ్య వారి జనాభాతో పోల్చినపుడు చాలా అధికంగా వున్నది.

సామాజిక అదుపు సాధనంగా జైళ్ళను ప్రభుత్వాలు వినియోగిస్తున్నాయని విజయ రాఘవన్ అభిప్రాయపడ్డారు. విచారణ ఖైదీలకు నాణ్యమైన న్యాయసహాయం యొక్క అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. (ఇపిడబ్ల్యు, 2016 జనవరి 23) న్యాయవ్యవస్థతో వ్యవహరించటం, ప్రత్యేకించి బెయిల్ తీసుకోవటానికి సంబంధించిన అంశం వంటి వాటిల్లో చొరవ, చర్చలు జరపటంలో అశక్తులైన సమాజంలోని కొన్ని విభాగాల వారి గురించి విస్తారంగా వివరించే సాహిత్యం మన ముందు వుంది. నేరారోపణ నెదుర్కొంటున్న వారికి న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయటం జరిగినప్పటికీ, ఆస్థిపరమైన జామీనుల సమస్య తలెత్తుతున్నది. ఆవిధంగా, ఆస్తిలేని వ్యక్తులు బెయిలు పొందటంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జామీనుగా వుంచిన ఆస్తిని న్యాయస్థానం జప్తుచేస్తుందనే భయమే, నేరారోపణ నెదుర్కొంటున్న వ్యక్తిని తిరిగి కోర్టు బోనులో నిలపగలుగుతుందని కోర్టు భావిస్తోంది. ఏమైనప్పటికీ, బెయిల్ మంజూరు చేయటానికి ఆస్తి పూచీకత్తుగా వుండి తీరాలనే నిబంధన విధించటం, కేవలం ఆస్తి వున్న వర్గాలకు మాత్రమే న్యాయం అనుకూలంగా వుందనే సందేశాన్ని ఇస్తోంది.

స్వేచ్ఛ ప్రసాదించటానికి లేదా బెయిల్ పొందటానికి ఆస్తి మాత్రమే ఏకైక ప్రాతిపదికగా ఎందుకు వుండాలి? ఆస్థిలేకపోవటమనే ఏకైక కారణంతో న్యాయం పొందటంలో, ప్రత్యేకించి బెయిల్ పొందటానికి ఆటంకంగావున్న నిర్దిష్ట సెక్షన్లను మినహాయించాలి. ఏమైనా ఆదివాసులు నివసించే అటవీ భూములేవీ స్థిరాస్థులుగా పరిగణించరు గనుక వారి పట్ల మరింత జాగ్రత్త, తక్షణం దృష్టిసారించాల్సిన అవసరాన్ని, విచారణ ఖైదీలుగా జైళ్ళలో మగ్గుతున్న ఆదివాసుల అనుభవాలు తెలుపుతున్నాయి.

కేరళకు ఈ అంశాన్ని వర్తింపజేసి పరిశీలిస్తే, కేరళ అభివృద్ధి నమూనా ఉన్నత సామాజిక అభివృద్ధిని సాధ్యం చేసినప్పటికీ, సమాజంలోని నిర్దిష్ట విభాగాలను ప్రత్యేకించి ఆదివాసీ జనాభాను అభివృద్ధి పరచలేకపోయింది. ఇప్పటికీ, పరిగణించ దగిన సంఖ్యలో ఆదివాసులు అడవులలో నివసిస్తున్నారు. వారికి ఈనాటికీ స్వంత ఆస్తి ఏర్పడలేదు. భూమికోసం పోరాటం ఏనాటినుండో ప్రారంభమై ఈనాటికీ కొనసాగుతోంది. 2006లో కేరళ ప్రభుత్వం షెడ్యూల్డు జాతులు, ఇతర సాంప్రదాయ అటవీ వాసుల (అటవీ హక్కుల గుర్తింపు) చట్టాన్ని చేసింది. ఈ చట్టం అడవులలో నివాసం వుండే వారందరికీ చట్టబద్ధ హక్కులను గ్యారంటీ చేసి స్వీయ వ్యవసాయంకోసం గానీ లేదా ఇతరేతరమైన ఉమ్మడి అనుభవంలో వున్నా గానీ లేదా జీవనాధారాన్ని గ్యారంటీ చేసే నివాసంగానీ కల్పిస్తూ కొంత భూమిని వారి పేర్లతో నమోదు చేసింది. ఈ హక్కు పత్రంతో విడివిడిగా వ్యక్తులపేరున కేటాయించిన అటవీ భూమి స్థిరాస్థిగా పరిగణింపబడుతుందా అనేది ఇక్కడ ప్రశ్న. ఈ సందర్భంలో భూమి లేకపోవటం, స్థిరాస్థిపై హక్కు మొదలైన అంశాలను విశ్లేషణ చేయాలి.

సమాచార హక్కు చట్టం ద్వారా, కేరళ జైళ్ళశాఖ నుండి సేకరించిన విచారణ ఖైదీల సంఖ్య ఆధారంగా, కేరళలోని వివిధ జైళ్ళలో 150 మంది ఆదివాసీ విచారణ ఖైదీలున్నారు. ఈ అంశంపై విచారణలోకి వెళ్ళినపుడు దృష్టికొచ్చిన మరో ముఖ్యమైన అంశమేమంటే, స్థిరాస్థి లేని కారణంగా ఈ ఖైదీలకు బెయిల్ నిరాకరించబడిందా? లేదా అనేది తెలియరాలేదు. ఏమైనా, ఈ ప్రత్యేక కారణంతో బెయిల్ నిరాకరింపబడిన వారి సంఖ్య గురించిన సమాచారం లభించటంలో తీవ్రమైన పరిమితి నెలకొని వుంది. జైళ్ళశాఖ ఆవిధమైన వివరాలతో కూడిన రికార్డును నిర్వహించదని జైళ్ళశాఖాధి పతులలో అత్యధికులు పేర్కొన్నారు. ఈ అంశాలు మేజిస్ట్రేట్ కోర్టు పరిధిలోకి వస్తాయని వారు నొక్కి చెప్పారు.

ఏమైనా, కొద్దిమంది జైళ్ళ అధికారులు మాత్రమే తమ జైళ్ళలో ఆదివాసీ విచారణ ఖైదీలున్నట్లుగా తెలిపారు. స్థిరాస్థి జామీనులేని కారణంగానే వారికి బెయిల్ నిరాకరించబడిందని వివరించారు. మనథావాడి, వాయనాడు జిల్లా జైళ్ళనుండి లభించిన సమాచారాన్ని బట్టి జామీను సమర్పించటంలో విఫలమైన కారణంగా నలుగురు ఆదివాసులకు బెయిల్ నిరాకరింపబడిందని మరింత స్పష్టంగా తెలుస్తోంది. త్రిసూర్‌లోని కేంద్ర కారాగారం నుండి అందిన సమాచారం కూడా ఇలాంటి మరో ఆరుగురి గురించి తెలుపుతోంది. అంటే దీని అర్థం మిగిలిన ఆదివాసీ విచారణ ఖైదీలు బెయిలు పొందారని అర్థంకాదు. జైలు రిమాండ్ ఫైల్స్ ప్రకారం చాలా కొద్దిమందికే బెయిల్ లభిస్తోండగా, అత్యధికులు విచారణ ఖైదీలుగా తుది తీర్పు వెలువడేవరకు జైళ్ళలోనే మగ్గిపోతున్నారు. జాగ్రత్తగా, వివరణాత్మకంగా విశ్లేషిస్తే, ఆదివాసుల శ్రేణి దాదాపు న్యాయవస్యస్థ నుండి మినహాయించబడ్డారని లేదా న్యాయ వ్యవస్థతో వ్యవహరించగలిగిన స్థితిలో వారు లేరని అర్థమౌతుంది. వీరిలో అత్యధిక విచారణ ఖైదీలు అబ్కారీ చట్టంలోని చిన్నపాటి సెక్షన్లపై నేరారోపణకు గురైవున్నారు.

ఇదే ఆరోపణలు ఎదుర్కొంటూ, ఇదేతరహా సెక్షన్లక్రింద నేరారోపణ చేయబడిన ఆదివాసీ యేతర విచారణ ఖైదీలు సాపేక్షంగా సులభంగా బెయిల్ పొందగలుగుతున్నారని ఖైదీల రిమాండ్ నివేదికలు తెలియజెప్తున్నాయి. స్వేచ్ఛను పొందటానికి, విచారణ ఖైదీలుగా నున్న వారు బెయిలు పొందటానికి ఆస్థిని ప్రాతిపదికగా చూడటాన్ని మార్పు చేయాలనే డిమాండ్‌ను ఈ సందర్భంలో ముందుకు తేవలసియుంటుంది.

**(కోజికోడ్‌కు చెందిన షహరాబ్ పెరుమాళ్ళు ఇపిడబ్ల్యులో రాసిన వ్యాసమిది–సంపాదకుడు)**

oooo